ఈ వారం కథ

# పుకారు

- ఎ.జయలక్ష్మీరాజు

**పుకారుకున్న బలం నిజంగా నిజానికి లేదు. పుకారుకు, అర్థం అబద్ధమే అయినప్పటికీ నిజమని నమ్మించి వేగంగా ప్రాకిపోతుంది. సావిత్రి పుట్టిన ప్పటి నించి పుకారు ఆమెను నీడలా వెంటాడుతూనే ఉంది.**

**'దేవుని ఎదుట...**
**'దేవుని ఎదుట...**
**'ప్రమాణం చేసి...**
**'ప్రమాణం చేసి...**
**'అంతా నిజమే చెబుతాను**
**'అంతా నిజమే చెబుతాను...**
**'అబద్ధం చెప్పను...**
**'అబద్ధం చెప్పను...**

స్వార్థాలకూ, నీచాలకూ, దోపిళ్ళకూ, హత్యలకూ, చివరికి అబద్ధాలకు... కేవలం అబద్ధాలకు మాత్రమే భగవద్గీత వినియోగింపబడుతోంది... కోర్టులో!

'మీ పేరు?'

'సావిత్రి' ఇంత పెద్ద ప్రమాణం చేయించుకున్నది పేరు అబద్ధం చెబుతాననా? నవ్వుకుంది సావిత్రి. అనేకానేక అవరోధాలను అధిగమించి, తనలోని సకల జీవశక్తులను మేల్కొలిపి యుద్ధానికి సిద్ధమయింది సావిత్రి.

'సత్యమూర్తి అనబడే మీ భర్త ఆరోపించిన విధంగా... మీకు చాలా మంది మగవాళ్ళతో అక్రమ సంబంధాలున్నది నిజమేనా?'

ఎవరైనా ఇలాంటి విషయాలు ఒప్పుకుంటారా? అందులోనూ... ఇలా... కోర్టులో... ఇంతమంది జనం ఎదుట... కాసేపు మౌనంగా ఉంటే...? అది అర్ధాంగీకారమౌతుందేమో. మౌనంలో పూర్తి నిజం లేనపుడు, నోరు తెరిస్తే మంచిదేమో!

'అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పండి!' లాయరు గద్దింపు! ఫీజు ముందే ముట్టినట్టుంది. భావోద్రేకంతో నల్లకోటును ఊపేసి 'లా కోర్సు'ను కోర్టులో అప్పజెప్పాలని తెగ ఆత్రుత పడుతున్నాడు. ఎదురుగ్గా బోనులో ఉన్న సావిత్రి భర్త సత్యమూర్తి సావిత్రి ఏం చెబుతుందోనని టెన్షన్ ఫీలవుతున్నట్టు కళ్ళెత్తి చూడకుండానే గ్రహించింది. తను అతని అర్ధాంగి! అతనిలో సగభాగం...! అర్థేచ... కామేచ... ధర్మేచ... నాతిచరామి... నాతిచరామి... నాతిచరామి... వేదమంత్రాల ఘోషల మధ్య, రెండు ప్రాణులను కలిపి... జీవితమంతా తన్నుకు చావటానికి ఇంత పెద్ద తతంగం... ఖర్చు... టెన్షన్... అట్టడుగున నిక్షిప్తమై ఉన్న గతకాలపు జ్ఞాపకాల పుస్తకపు మొదటి పేజీ నించి తిరగేసింది మనసు!



★★★

'మీ అమ్మ నువ్వు పుట్టినపుడు ఏడ్చిందే అమ్మడూ!'

'ఎందుకు నానమ్మా?'

'అయిదో కాన్పులో కూడా ఆడపిల్లే పుట్టిందని'

'అయితే అమ్మకు నా మీద ప్రేమలేదా?'

'తల్లికి బిడ్డ మీద ప్రేమ ఉండదా? అప్పుడయితే అలా బాధపడింది కానీ నిన్ను అపురూపంగా చూసుకుంది!'

'నువ్వన్నీ అబద్ధాలే చెబుతావు. ఆ మధ్య నేను పొరపాటుగ బస్సు కింద పడబోతే... పడితే పీడా పొయ్యేది. ఓ లక్షన్నర మిగిలి ఉండేది అనలేదూ!'

'అవన్నీ సరదాకన్న మాటలు. మనసులో పెట్టుకోకూడదు. అన్నదెవరు? అమ్మేగా!'

'నాకు కుజదోష ముందిట కదా! నాకు పెళ్ళి కాదుట నిజమేనా నానమ్మా?'

'కుజదోషం లేదు. గాడిద గుడ్డు లేదు. మీ మేనమామ పుట్టించిన పుకారు. వాడి కొడుక్కి నిన్ను చేయాలని వాడి కోరిక. రేచీకటి వెధవని, నేను పడనివ్వలేదు. కోపంతో నీ మీద పుకారు పుట్టించాడు'

'నాకసలు పెళ్ళి వద్దు పాడు వద్దు. ఉద్యోగం చేస్తాను. అమ్మానాన్నలను పోషిస్తాను!'

'అలా అనకూడదే అమ్మడూ! ఉద్యోగం చేసినా ఊళ్ళేలినా ఆడపిల్లకు పెళ్ళే పరమావధి!'

...

'అతనికి వయసు ఎక్కువుందట. అందంగా లేడట కదా!?'

'అందం కొరుక్కుతింటామా? వయసు వడబోసి తాగుతామా? గుణం ముఖ్యం కానీ. మీ తాతయ్యకూ, నాకూ ఇరవై ఏళ్ళ తేడా. సుఖంగా కాపురం చెయ్యలేదూ! పెద్ద బంగళా, మంచి ఉద్యోగం, ముసలి మామగారు తప్ప ఆడపడుచులు, అత్తపోరు లేదు. అంతకంటే అదృష్టమా?'

పెళ్ళికొడుకు వయసునూ, అందాన్ని, గుణాన్ని... పెద్ద బంగళా, ఆస్తి, ఉద్యోగం... అనబడే అందమైన 'నగిషీ' పెట్టెలో దాచి కాపురానికి పంపారు సావిత్రిని.

'ఇంకేం పేర్లు లేనట్టు నీ పేరేమిటి సావిత్రి అని పెట్టారు? సావిత్రిలాగా, పతివ్రతలా బతకాలనా? అయినా ఈ రోజుల్లో అంత స్వచ్ఛమైన పతివ్రతలున్నారంటావా? కనీసం రెండుసార్లు అబార్షన్లు చేయించుకుని, గప్‌చిప్‌గా... పొలగ్లాసు పట్టుకుని శోభనానికి హాజరవుతున్నారు.'

'మొట్టమొదటి లవ్ లెటర్ నీకే వయసులో వచ్చింది?'

'వరసయిన వాళ్ళు మీ దగ్గరి బంధువుల్లో లేరా? వయసయిపోయిన నాకిచ్చి చేశారు!'

'చాలా కట్నం ఇస్తున్నారంటే పిల్లలో ఏదో లోపం ఉండి ఉంటుంది అని మా ఫ్రెండ్స్ అంటున్నారు. పైకి కనిపించే లోపాలేం నీకు లేవు మరి...'

'... ...'

'అన్నట్టు నీకు కుజదోష ముందిట కదా? కట్నమెక్కువిచ్చారు కదా మీ వాళ్ళు. అలాంటి పట్టింపులేం లేవని అడ్జస్టయి పోయాననుకో!'

'మరీ పతివ్రతలా కాకపోయినా... నాక్కాస్త నమ్మకం కలిగేలా... నటిస్తే... కాదు... ప్రవర్తిస్తే చాలు!'

మొట్టమొదటి రాత్రి భర్త వేసిన ప్రశ్నలకు జవాబులడిగింది సావిత్రి అమ్మను... నానమ్మను.

'హయ్యో! మగాళ్ళన్న తర్వాత సవాలక్ష ప్రశ్నలతో వేధిస్తారు మరి! అవన్నీ పట్టించుకుంటే కాపురం చేసినట్టే! ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయాలి గాని! అల్లుడుగారు ఎంతో నయం. ఎదురింటి కామాక్షి అల్లుడు లేడూ! అదేదో కన్యాత్వ పరీక్షట! అది చేయిస్తే తప్ప వీల్లేదని అలకపాన్పు మీద కొరాడట.

అసలు ఇలాంటి విషయాలు కడుపులో దాచుకోవాలి. బరితెగించిన దాన్లా బయటకు చెప్పుకోకూడదు.

నాతో చెబితే చెప్పావ్. ఇంకెవరితో చెప్పకేం!'

సావిత్రి గొంతు పెగలకుండా నొక్కేశారు.

★ ★ ★

'ఎవడో నీ కోసం చాలాసార్లు ఇంటి ముందు సైకిల్ మీద బీటు కొట్టినట్టున్నాడు. ఇంటి ముందు సైకిలు వెళ్ళిన గుర్తులు చాలా ఉన్నాయి!'

'అది మెయిన్ రోడ్డు! ఎంతోమంది వెళుతుంటారు. నా కోసం బీట్లు అంటారేమిటి? ఒకవేళ నిజంగానే ఎవరైనా బీట్లు కొట్టారేమో! వీధి తలుపు తియ్యలేదు నేను' అక్కసుగా అంది సావిత్రి.

'ఎవరికైనా లవ్ లెటర్ రాశావా? లోపలున్న పెన్ను బయటకొచ్చింది!'

'చాకలి పద్దు రాశాను!'

'ఎంగిలి కంచాలు నాలుగున్నాయేమిటి? నీ లవ్వర్‌గాని వస్తే వండి వడ్డించావా?'

'మీ నాన్నగారు రెండోసారి అన్నం తిన్నారు!'

'సాయంకాలమయ్యే సరికి వేశ్యలాగా సింగారించుకుంటావు. ఎవరి కోసం!'

వేశ్య ప్రతి రాత్రి ఎవడో ఒకడు వస్తాడని సింగారించుకుని తయారవుతుంది. భార్య రాత్రి పగలూ కూడా ఒక్కడి కోసమే తయారవుతుంది. ఒక్కడి కోసమే బతుకుతుంది. వేశ్య దేహం మాత్రం అమ్ముకుంటుంది. భార్య దేహం, మనసు, చాకిరి, అభిమానం, నీతి, ఆత్మ... అన్నీ అమ్ముకుంటుంది. ఒకే ఒక్క మంగళసూత్రానికి కట్టుబడి! అయినప్పటికీ మగవాడు భార్యను వేశ్యతో పోల్చి, ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తుంటే... ఇప్పుడు కూడా నోరు విప్పి మాట్లాడకూడదా? అమ్మ చెప్పినట్టు కడుపులో దాచుకోవాలా?

★ ★ ★

'మీ మామయ్యగారెంత పని చేశారో చూశారా?'

'ఏం చేశాడేమిటి?'

'నడుం నెప్పిగా ఉంది మందు రాయమంటే తండ్రి లాంటివారని, రాయబోయాను. నా చేయి పట్టుకున్నాడు!'

'అంతేకదా. ముసలాడు. చాదస్తం...'

'అంతేకాదు! అసహ్యంగా ప్రవర్తించబోయాడు...'

'అలాగా! అయితే రసికుడన్నమాట!'

'వావి వరసలు లేని రాక్షసుడు! నేను కాబట్టి సరిపోయింది. ఇంకొకరయితే చెప్పుచ్చుకు కొట్టి రభస చేసే వాళ్ళు!'

'ఏమిటీ ఊరుకున్నకొద్దీ పేలుతున్నావ్. వయసులో పెద్దవాడు. దగ్గరి బంధువు. అసలు నాకు ఆఫీసరుద్యోగం వచ్చింది ఆయన వల్లనే. ఆయనకు నచ్చినట్టు మసలుకో. ముందు ముందు అతనితో నాకు చాలా పన్లున్నాయి. అడ్జస్టయిపో. ఈ రోజుండి రేపు ఊరెళతాడు అంతే!'

వివాహానికి, భార్యాభర్తల అనుబంధానికి ఉండే పవిత్రత... ధర్మాలు పోయాయి. కొత్త ధర్మం అమలులోకొస్తోంది.

ఇప్పుడు కూడా గొంతు విప్పకూడదా? ఇది కూడా కడుపులో దాచుకోవాలా?

'అసలు మీరు నా భర్తేనా?'

'ప్రశ్నలెయ్యటం ఎప్పట్నుంచీ నేర్చుకున్నావ్. చెప్పినట్టు చేస్తే ఇంట్లో ఉండు. లేకుంటే గడప దాటు. తెల్లారేసరికి లక్షల కట్నంతో ఇంకోదాన్ని చేసుకుంటాను!'

స్త్రీ ప్రశ్నిస్తే ప్రపంచానికి శత్రువవుతుంది. మెట్టినింటి గుమ్మం దాటి వచ్చిన స్త్రీని ఈ ప్రపంచం ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

'ఏమిటమ్మా నీ జాతకం? నీ మీద ఈ పుకార్లేమిటి? అల్లుడుగారు గర్భవతివని కూడా చూడకుండా ఈ విడాకుల నోటీసేమిటి తల్లీ. ఇలా పంపారు!'



'అతని ప్రపంచం అతనిది! నా వ్యక్తిత్వం నాది. అతను మారడు. నాక్కావల్సిందిప్పుడు అతని ప్రపంచం మీద విజయం. అంతేగానీ నా వ్యక్తిత్వాన్ని చంపుకుని అతని ప్రపంచంలోకెళ్ళే ప్రసక్తిలేదు' అంటున్న కూతురి వైపు నిరసనగా చూశాడు సావిత్రి తండ్రి.

'నేనింత మొత్తుకుంటుంటే బదులు మాట్లాడవేమిటి? అతనితో కాపురం చేస్తావా? చెయ్యవా? అదైనా చెప్పి ఏడ్చి సంతకం పెట్టి పంపు! బతికినంత కాలం ఇంత ముద్ద పడేస్తాను తిని పడుండువుగాని!' తండ్రి అరుపులకు నోరువిప్పి మాట్లాడింది సావిత్రి.

'అతని ప్రపంచం అతనిది! నా వ్యక్తిత్వం నాది. అతను మారడు. నాక్కావల్సిందిప్పుడు అతని ప్రపంచం మీద విజయం. అంతేగానీ నా వ్యక్తిత్వాన్ని చంపుకుని అతని ప్రపంచంలోకెళ్ళే ప్రసక్తిలేదు' అంటున్న కూతురి వైపు నిరసనగా చూశాడు సావిత్రి తండ్రి.

'నలుగురితోపాటు నారాయణా!' అని బతికేయటం తప్ప సొంత వ్యక్తిత్వం స్త్రీలకుండటం... ఏ పురుషుడూ... చివరికి తండ్రి కూడా సహించలేదు!

సావిత్రి ఆలోచనలు బతుకు పుస్తకపు ఖాళీ పేజీ దగ్గర కొచ్చి ఆగిపోయాయి.

★ ★ ★

'ఏమమ్మా! నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పు! నీకు అక్రమ సంబంధాలున్న మాట నిజమేనా?' లాయరు గద్దింపు.

'నిజమే!'

సావిత్రి భర్త ఉలిక్కిపడ్డాడు. ఊహించనివి, విన్నప్పుడే కదా ఉలికిపాటు!

కోర్టులో నల్లకోటు ఊగిపోతోంది ఆవేశంగా. 'ఉద్యోగస్థుడు... అందగాడు... మంచివాడు అయిన భర్త ఉండగా అక్రమ సంబంధం పెట్టుకోవటం నేరం కాదా? యువరానర్! ఈ యువతికి ఈ అక్రమ సంబంధాల బుద్ధి... వంశపారంపర్యంగా వచ్చిందని...'

'ఆగండి సార్! చరిత్రను పెకలించకండి!' గొంతు విప్పింది సావిత్రి. కోర్టులో అంతా నిశ్శబ్దం. సావిత్రి మాటలను చెవులు రిక్కించి వినసాగారంతా!

'ఏ స్త్రీ అయినా అందగాడు... ఉద్యోగస్థుడు... మంచివాడు అయిన భర్త ఉండగా అక్రమ సంబంధం పెట్టుకుందంటే దాని వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. ఆ కారణం ఏమిటంటే...'

'... ... ...!'

సావిత్రి భర్త బతికినంతకాలం ఏ స్త్రీ కూడా ధైర్యంచేసి అతని జీవితంలో ప్రవేశించటానికి వీల్లేకుండా... మగవాడి వెన్నువిరిచి, మెదడు చిట్లినంత పనిచేసే... లోపం... అంటగడుతూ... ఓ పుకారు లేవదీసి బోను దిగి వచ్చింది సావిత్రి. మనసు తేలిక కాగా! పుకారుకు పుకారే సమాధానమన్నట్టు.

★

